ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 25.0

హైలెట్స్

- రూ.99 కోట్లతో 892 జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి
- హౌసింగ్ కాలనీల్లో తాగునీటి సరఫరా
- విద్యుత్ శాఖ ద్వారా సూర్యఘర్ కింద ప్రోత్సాహం
- ఐదు సోలార్ గ్రామాలను ఇప్పటికే గుర్తింపు
- ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా 3,257 చికిత్సలు
- తల్లికి వందనం పథకం కింద 2 లక్షల 44 వేల మంది విద్యార్థులకు రూ.366 కోట్లు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ ద్వారా రూ.114 కోట్లు
- స్త్రీ నిధి కింద 57.57 లక్షల రుణాలు
- మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాలకు రూ.592 కోట్లు
- బాల సంజీవిని ద్వారా రూ.16.55 లక్షలు ఖర్చు
- సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రూ.ఐదు కోట్ల 73 లక్షలు
- రూ.62.21 కోట్లతో దీపం ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ధాన్యం కొనుగోలుకు రూ.583 కోట్లు
- ఉచిత ఇసుక పంపిణీ ద్వారా లక్షా 21 వేల 336 మెట్రిక్ టన్నుల ఇసుక


జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి

మాది సుపరిపాలన


పోలీస్ శక్తి టీమ్, పోలీస్ వైట్ కోడ్స్ వాహనాల ప్రదర్శన

- » సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు
- » పోలవరం త్వరలోనే పూర్తి చేస్తాం
- » మెగా డీఎస్సీతో సహా అందరికీ ఎన్నో మేళ్లు
- » పీ 4 ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమే
- » స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం
- » వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం
- » ప్రజలు మెచ్చేలా చేరువలో పాలన
- » స్వాతంత్ర్యదిన వేడుకల్లో మంత్రి పార్థసారథి


రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. నదుల అనుసంధానంలో కీలకమైన ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటు న్నాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలనకు తొలి రోజు నుంచి నాంది పలికింది కూటమి ప్రభుత్వం. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టాం.
- మంత్రి కొలుసు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

'ఇప్పటికే అనేక పథకాలకు అంకురార్పణ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అందరికీ సంతృప్తి కరంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే పనిచేసే ప్రభుత్వం మాది'.. అని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. 79వ స్వాతంత్ర్యదిన వేడుకల సందర్భంగా శుక్రవారం పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'మనది వ్యవసాయ ఆధారిత జిల్లా. రైతు బాగుంటేనే రాష్ట్రం, జిల్లా బాగుంటుంది. అందుకే సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్లు రూ.నాలుగు వేలకు పెంపు, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత ఇసుక విధానం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను అమలు చేశాం. స్వాతంత్ర్య దినోత్సవ వేళ స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నాం. జిల్లాలో 190 బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణ సౌకర్యం అందించే అవకాశం ఉంది. సుమారు 57 వేల మంది మహిళలు ప్రయాణం చేసే అవకాశం ఉంది. జీరో పావర్టీ కోసం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నాం. పేదరికం లేని సమాజం కూటమి ప్రభుత్వ విధానం. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతను ఇవ్వడం ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చు. పీ-4 విధానంలో పేదరిక నిర్మూలన సాధనకు కృషి **(మిగతా 8వ పేజీలో)**

ఆకట్టుకున్న ప్రగతి శకటాల ప్రదర్శన

ఏలూరు రూరల్/ఏలూరు క్రైం : స్వాతంత్ర్యదిన వేడుకల్లో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో వివిధ ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతిని తెలియజేస్తూ ప్రదర్శించిన 'ప్రగతి శకటాల' ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యా శకటానికి ప్రథమ, వ్యవసాయశాఖ శకటానికి ద్వితీయ, గృహ నిర్మాణశాఖ శకటానికి తృతీయ బహుమతులు లభించాయి. సంబంధిత శాఖల అధికారులను మంత్రి కొలుసు పార్థసారథి కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు.



ప్రథమ బహుమతి సాధించిన విద్యా విభాగం శకటం

పటిష్ఠ బందోబస్తు

కాగా జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ ఆదేశాలతో పోలీస్ పరేడ్ గ్రౌండ్ చుట్టూ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌లో వెళ్లే ప్రతి ఒక్కరిని మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. స్టేజీ వద్ద నాలుగువైపులా డిస్ట్రిక్ట్ గార్డులతో భద్రతను ఏర్పాటు చేశారు.

అవార్డులు అందుకున్న జిల్లా అధికారులు..


వి.విశ్వేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి


ఎస్.సూర్యచంద్రరావు అడిషినల్ ఎస్పీ


షేక్ హబీబ్ బాషా జిల్లా వ్యవసాయ శాఖాధికారి


టి.గోవిందరాజు పశుసంవర్ధక శాఖ జేడీ


డి.నీలాద్రి, లీడ్‌బ్యాంకు మేనేజర్


టి.శ్రీనివాస్, జిల్లా ఫైర్ అధికారి


ఎస్.రామ్మోహన్, జిల్లా ఉద్యాన శాఖాధికారి


పి.సాల్మన్‌రాజు ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్


ఎ.శ్రీనివాస్, డీసీవో


ఆర్.విజయరాజు పీడీ, డీఆర్‌డీఏ


జి.సత్యనారాయణ, జిల్లా హౌసింగ్ అధికారి


ఎన్ఎస్ కృపావరం, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి


కేఎస్ ప్రభాకర రావు, సీఈవో, సెట్‌వెల్/యూత్ వెల్ఫేర్


కేవీ సుబ్బారావు పీడీ, డ్వామా


కె.పంకజ్‌కుమార్ ఎస్ఎస్ఏ, అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్


ఎ.అవులయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

11 మంది పోలీస్ సిబ్బందికి సేవా పతకాలు
స్వచ్ఛంద సంస్థలకు చెందిన తొమ్మిది మందికి ప్రశంసా పత్రాలు


బి.శ్రీనివాసరావు, డీఎస్‌డీవో


ఎస్.జితేంద్రబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

ఉత్తమ అధికారులు వీరే..

ఏలూరుసిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్యదిన వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో మెరుగైన పనితీరు, ప్రతిభ కనబరిచిన 19 మంది జిల్లా అధికారులు, 367 మంది వివిధ శాఖల ఉద్యోగులకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరితో పాటు 11 మంది పోలీస్ సిబ్బందికి పోలీస్ సేవా పతకాలను అందజేశారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలకు చెందిన తొమ్మిది మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌లకు సేవా పతకాలు

నూజివీడు సీఐ కె.రామకృష్ణ, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, ఆర్ఐ జీఎస్‌పీ పవన్‌కుమార్, దెందులూరు హెచ్‌సీ ఎన్‌వీఆర్ సత్యనారాయణ , ఏలూరు ఉమెన్ పోలీస్ స్టేషన్ హెచ్‌సీ టి.కృష్ణారావు, ఏలూరు టూటౌన్ హెచ్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ హెచ్‌సీ పి.చిట్టిబాబు, చింతలపూడి కానిస్టేబుల్ ఎన్.సురేష్, టి.నరసాపురం కానిస్టేబుల్ ఎ.నాగబాబులకు సేవా పతకాలను అందజేశారు. వీరితో పాటు పోలీస్ పీఆర్వో జి.కేశవరావుకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్వచ్ఛంద సంస్థలకు మెరిటోరియస్ సర్టిఫికెట్లు

హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, పెరికే ఫౌండేషన్ పెరికే వరప్రసాదరావు, మానవత జిల్లా కన్వీనర్ పి.దేవరత్నాకరరావు, మానవత డైరెక్టర్ మానేపల్లి రామారావు, ఇండియన్ రెడ్ క్రాస్ ల్యాబ్ టెక్నీషియన్ పి.సునీల్, ఎంసీహెచ్‌డబ్ల్యు పి.జానకి, పోలీస్ శాఖ తరపున పల్లెం ఆచార్య, శుభం, ఆశాజ్యోతి డైరక్టర్ మాధవీలతలకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రశంసా పత్రాలను అందజేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన లక్ష్మణ్, నీలిమలకు మంత్రి సారథి జ్ఞాపికలను బహూకరించారు.


చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద వరద ఉధృతి

తమ్మిలేరుకు పెరిగిన వరద

చాట్రాయి/చింతలపూడి, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కురు స్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. వరద ఉధృతి కారణంగా మండలంలోని కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు, చీపురుగూడెం, మల్లాయిగూడెం గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రానికి తమ్మిలేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3400 క్యూసెక్కులు ఉందని, ప్రస్తుత నీటి మట్టం 344 అడుగులు కాగా, ప్రాజెక్టు సామర్థ్యం 355 అడుగులు అని ప్రాజెక్టు ఏఈ లాజర్ బాబు తెలిపారు. 352 అడుగులకు చేరితే వరద నీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు.

ఆక్వా రైతుల్లో ఆందోళన


పట్టుబడి చేసిన చిన్న సైజు రొయ్యలు

కలిదిండి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో పాటు పలు వ్యాధులు, వైరస్ సోకే ప్రమాదం ఉండడంతో చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లను తిప్పుతున్నారు. ట్రంప్ సుంకంతో రొయ్యలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైరస్ సోకి రొయ్యలు చనిపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. పలు గ్రామాల్లోని చెరువుల్లో ఆక్సిజన్ లోపించి చిన్న సైజు రొయ్యలు చనిపోతుండడంతో హడావిడిగా పట్టుబడి చేసి ఏలూరు, ఆకివీడు మార్కెట్‌కు తరలించి అయిన కాడికి అమ్ముకుంటున్నారు. చిన్న సైజు రొయ్యలను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 24.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 4.6 మి.మీగా నమోదయింది. చాట్రాయి 24.2, వేలేరుపాడు 21, కామవరపుకోట 14.2, కొయ్యలగూడెం 11, జంగారెడ్డిగూడెం 9.6, టి.నరసాపురం 5, లింగపాలెం 3.8, కుక్కునూరు 3.8, బుట్టాయిగూడెం 2.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 2 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

జుత్తిగ అమ్మవారి ఆలయంలోకి వరద నీరు

■ లోపలి పేజీలో..

రైట్.. రైట్

- » జిల్లా అంతటా ఉచిత బస్సులు పరుగులు
- » తొలి రోజే అన్ని బస్సుల్లోను కిటకిట
- » ఏలూరులో ఆరంభించిన మంత్రి కొలుసు
- » మహిళలతో కూడిన బస్సులను నడిపిన చింతమనేని, గన్ని
- » తమ నియోజకవర్గాలకు వెళ్లే బస్సులను జిల్లా కేంద్రం నుంచి ప్రారంభించిన ఎమ్మెల్యేలు
- » జంగారెడ్డిగూడెంలో ఎంపీ పుట్టా ప్రారంభం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నడుమ శుక్రవారం స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అట్టహాసంగా ఆరంభమైంది. తొలి రోజే పెద్ద సంఖ్యలో మహిళలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులో ఈ పథకాన్ని ప్రారంభించారు. తన నియోజకవర్గం నూజివీడు వెళ్లే బస్సులో ఆయన ప్రయాణం చేశారు. ఏలూరు బస్టాండ్ నుంచి ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు, చింతలపూడి నియోజకవర్గాలకు సంబంధించిన బస్సులను సంబంధిత ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, డాక్టర్ కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. మహిళలకు మేలు చేకూర్చే ఈ పథకం ఆరంభించడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి కొలుసు అన్నారు. కేవలం ఆధార్ ఉంటే చాలు బస్సులో ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు. అన్ని వయస్సుల మహిళలు దీనికి అర్హులేనని తేల్చి చెప్పారు. ముందుగా జిల్లాల వరకే ఈ పథకాన్ని అమలు చేయాలని అనుకున్నారని, అయితే యువనేత నారా లోకేశ్ పట్టుదలతో ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం సంక్షేమానికి మేమే ఆద్యులమని గొప్పలు చెప్పిందని, సంపూర్ణ మద్యపాన నిషేధమని చెప్పి కల్తీ మద్యం తీసుకొచ్చి మహిళల మంగళ సూత్రాలు తెంచారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమికి అందించిన విజయాన్ని బాధ్యతగా భావించి తామంతా పనిచేస్తున్నామన్నారు. ప్రతీరోజూ 35 వేల మంది మహి ళలు జిల్లాలో ఉచితంగా ప్రయాణిస్తారని, ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారనే చులకన భావన సిబ్బందిలో ఎంతమాత్రం ఉండకూడ దని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఆర్టీసీ సిబ్బందికి మంత్రి సూచిం చారు. మహిళల సంక్షేమం టీడీపీతోనే మొదలైందని, ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం అత్యద్భుతమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని స్త్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, తమ నియోజకవర్గంలో పాత సర్వీసులను పునరుద్ధరించాలని దెందులూరు సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్త్రీ శక్తి పథకం కింద 190 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు.


ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్




స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించి స్వయంగా బస్సులు నడుపుతున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరులో మహిళల ఉచిత బస్సును దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని స్వయంగా డ్రైవింగ్ చేసి అందరిలో ఉత్సాహం నింపారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సైతం ఉచిత ప్రయాణానికి టికెట్ తీసుకుని బస్సులో ప్రయాణం చేశారు. మంత్రి పార్థసారథి నూజివీడులో మహిళలతో ప్రయాణించి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఉంగుటూరు నుంచి ఏలూరు వెళ్లే బస్సును నడిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్ పెద బాబు, విజయవాడ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, షెడ్యూలు కులాల ఆర్థిక సంస్థ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, జిల్లా ప్రజా రవాణ అధికారి షబ్నం, ఆర్టీసీ జీఎం జి.వాణి, డీఎస్పీ శ్రావణకుమార్ పాల్గొన్నారు. కాగా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ఏలూరు ఎంపీ ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ ప్రారంభించారు.


మహిళలకు ఉచిత బస్సు ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు, కలెక్టర్

చాలా సంతోషంగా ఉంది



వైద్యం అవసరమైతే మేము విజయవాడ, గుంటూరు వెళ్లాలి. గతంలో బస్సులో వెళ్లి రావడానికి రూ.300 వరకు ఖర్చు అయ్యేది. బంధువుల ఇళ్లకు వెళ్లాలన్నా రూ.500 వరకు ఖర్చు తేలేది. ఇప్పుడు ఉచిత స్త్రీశక్తి పథకంతో ప్రయాణంలో మిగులుతున్న డబ్బు కుటుంబ అవసరాలకు పిల్లల చదువుకు ఉపయోగపడుతుంది. టీడీపీ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకా లలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని చిత్తశుద్ధిని చాటింది.
- జగన్నాథం విజయలక్ష్మి, చింతలపూడి

స్త్రీశక్తి పథకం మహిళలకు వరం



ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకం మహిళలకు బాగా ఉపయోగ పడుతుంది. మహిళా ఉద్యోగులకు ప్రయాణ ఖర్చు మిగులుతుంది. విద్యార్థినులకు కొంతమేర డబ్బులు ఆదా అవుతాయి. గతంలో బస్సు చార్జీలు ఎక్కువగా పెరగడంతో ప్రయాణం అంటేనే భారంగా మారింది. ఇప్పుడు స్త్రీశక్తి అమలుతో కొంత వెలుసుబాటు కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులున్నా చిత్తశుద్ధితో ఇచ్చినమాట నిలబెట్టుకున్నారు.
- లక్ష్మీగౌరేశ్వరి, నూజివీడు

అప్పులు తిరిగి ఇవ్వడం లేదంటూ ఆత్మహత్య


బావిని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది

కొయ్యలగూడెం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పులు అడిగినప్పటికి తిరిగి ఇవ్వకుండా అడ్డం తిరుగుతున్నారని మనస్తాపానికి గురై ఒక వ్యక్తి కన్నాపురంలో గురువారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మజ్జి రామకృష్ణ (35) మోటార్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కొంతమందికి అప్పుగా సొమ్ము ఇచ్చాడు. అయితే అప్పు తీసుకున్నవారు ఎన్నిసార్లు అడి గినా తిరిగి ఇవ్వకపోగా ఎదురు తిరగడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీనికి తోడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులకు చనిపోతున్నట్టు వాట్సప్ మేసేజ్ పెట్టి గురువారం రాత్రి గ్రామ సమీప పొలాల్లో బావిలోకి దూకాడు. కుటుంబ సభ్యులు హుటాహుటీన ఘటనా స్థలానికి వెళ్లి బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అప్పులు తీర్చలేక మరొకరు..

ఏలూరు క్రైం : చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన పోతుమని నాగరాజు (35)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక చివరకు ఈనెల 14వ తేదీన పురుగుల మందుతాగాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



■ లోపలి పేజీలో..

డివైడర్‌ను ఢీకొట్టి యువకుడి మృతి

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన కారు..ఒకరి మృతి

భోజనకుతూహలం

గడ్డల్ని కరిగించే కంద ఆకులు

సంస్కృతంలో కందకు 'సూరణం', 'వేరు వెల్లకి' అనే పేర్లు ఉన్నాయి. శూరుడిలా పోరాడేది కాబట్టి ఈ దుంపను సూరణం అంటారు. ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- కడుపులో పెరిగే గడ్డలు, ఏలిక పాములపై ఇది పోరాడుతుంది. భౌగోళికంగా చూస్తే - కంద మొక్క దక్షిణాదివారి స్వంతం. ఉష్ణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరిగే మొక్క ఇది! భారతదేశం మొత్తం మీద తెలుగు నేలపైన పెరిగే కందకు ప్రసిద్ధి ఎక్కువ. పూర్వం వానప్రస్థాశ్రమంలో కంద మూలాలు తింటూ జీవించేవారని చెప్పేవారు. కంద మూలాలంటే సాధారణ అర్థంలో దుంపకూరలని! కంద అనేది సంస్కృత పదం, దుంప అనేది తెలుగు. ఈ రకంగా చూస్తే కంద లాంటి దుంప కూరలు, ఇతర ఉడకబెట్టిన దుంపలు తింటారని అర్థం. ఇక కంద ఆకులు వెడల్పుగా పెద్దవిగా రెమ్మలురెమ్మలుగా ఉంటాయి. వీటిలో ఎ- విటమిన్, ప్రొటీన్లు, ఫైబర్ ఉంటాయి. ఇక కంద వల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం..



- కంద ఆకులకు వేడి చేసే స్వభావం ఉంటుంది. అయితే ఈ స్వభావం వల్ల కంద ఆకులు శరీరంలోని ఉన్న దోషాలను పోగొడతాయి. కఫదోషం వల్ల కలిగే వ్యాధులు ఉన్నవారికి ఈ ఆకులను వండిపెట్టవచ్చు.
- ఒకప్పుడు బోదవ్యాధి ఎక్కువగా ఉండేది. ఆ సమస్య ఉన్నవారికి కంద మంచి ఔషధం.
- కంద కాడల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇవి పొట్టను మృదువుగా చేస్తాయి.
- కంద ఆకులను ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువగా తింటారు. అయితే లేత కంద ఆకులను తింటేనే మంచిది. ముదురు ఆకుల్లో ఆగ్జలైట్ క్రిస్టల్స్ ఎక్కువగా ఉంటాయి. ముదురు ఆకులను నేరుగా తింటే కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ఒకవేళ ముదురు ఆకులను తినాలనుకొనేవారు ఆకులను శుభ్రపరచి, సన్నగా తరిగి, మజ్జిగలో వేసి బాగా మెత్తపడేదాకా ఉడికిస్తే ఈ క్రిస్టల్స్ తొలగిపోతాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

తళుక్కున మెరవాలంటే...

ముఖ చర్మాన్ని కాన్వాస్‌గా మలిచి, అందంగా తీర్చిదిద్దడమే మేకప్. అందుకోసం కొంత ఓర్పు, నేర్పు అవసరమవుతాయి. నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోవడం ఒక ఎత్తైతే, వాటిని తగుమాత్రంగా ముఖానికి అద్దుకోవడం మరొక ఎత్తు. మెరుపులీనే తారలా తళుక్కుమనడం కోసం ఇవిగో ఈ మేకప్ కిటుకులు పాటించండి.



షేపింగ్: ముఖం కోలగా మలచాలన్నా, గుండ్రంగా తీర్చిదిద్దాలన్నా అందుకు తగిన మేకప్ మెలకువలు అనుసరించాలి. షాడో, బ్రాంజ్, కాంపాక్ట్‌ల షేడ్‌లను ఆచితూచి ఎంచుకుని, అవసరమైన చోటే అద్దుకోవాలి. ముక్కును తీర్చిదిద్దే తీరు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే దవడలు, చెవుల దగ్గర డెప్త్‌ను ఏ మేరకు పెంచాలో అంచనా వేయాలి.

ముడతలు: నుదురు, పెదవులు, కళ్ల కింది ప్రదేశాల్లో ముడతలు దాచడం కోసం అవసరానికి మించి కన్‌సీలర్ ఉపయోగించకూడదు. సహజసిద్ధమైన లుక్‌ను సొంతం చేసుకోవడం కోసం కళ్ల కింద ఎరుపు రంగు షేడ్‌ను పలుచగా అద్దుకుని, దాని మీద ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. కన్‌సీలర్‌ను పలుచగా అద్దుకుని, ఫౌండేషన్‌లో కలిసిపోయేలా చూసుకోవాలి.

హైలైట్: ముఖంలో కనుబొమలు, పెదవులు... ఇలా ప్రతి ఒక్కరి ముఖంలో ఏదో ఒక ఆకట్టుకునే అంశం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని సెంటర్ ఆఫ్ అటెన్షన్‌గా చేసి, దానికి తగ్గట్టు ముఖాన్ని మలిచే ప్రయత్నం చేయాలి. ఆకర్షణీయమైన కళ్లు ఉన్నవారు బోల్డ్ లైనర్‌ను ఉపయోగించాలి. పౌట్‌ను గుర్తించడం కోసం ముదురు రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి.

లైట్‌గా మొదలు పెట్టి: మేకప్ ఉత్పత్తులను వీలైనంత తక్కువగా వాడడం అలవాటు చేసుకోవాలి. కొద్దిగా కన్‌సీలర్‌ను చర్మం మీద అప్లై చేసి బ్రష్‌తో బ్లెండ్ చేసుకోవాలి. ఇంకొద్దిగా అవసరం పడితే, మళ్లీ అప్లై చేసుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను అప్లై చేయడం కోసం డో ఫుట్ అప్లికేటర్‌ను ఉపయోగించాలి.

ఐ షాడో బ్రష్: కనురెప్పల మీద ముడతలు ఉంటే, ఫ్లాట్ బ్రష్‌కు బదులుగా ఫ్లఫ్ఫీగా ఉండే బ్రష్ వాడాలి. సన్నని మొన కలిగిన బ్రష్ వాడడం వల్ల షాడో, కనురెప్పల ముడతల్లో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చివర్లో క్రీజ్ బ్రష్‌తో అదనపు షాడోను తొలగించుకోవాలి.

పిల్లలు ఆలస్యంగా పడుకుంటున్నారా..?

పిల్లలు నిద్రకు ఉపక్రమించే సమయం, ఎన్ని గంటలు పడుకుంటున్నారనే అంశాలు వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారంతోపాటు సరైన నిద్ర కూడా అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు సమయానికి నిద్రపోవడం వల్ల కలిగే లాభాలు, ఆలస్యంగా పడుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం...



సమయానికి నిద్రిస్తే...

- పిల్లలు రోజూ సరైన సమయానికి నిద్రించడం వల్ల శారీరకంగా వారి ఎదుగుదల బాగుంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. తరచుగా ఒత్తిడికి గురికాకుండా భావోద్వేగాల పరంగా నియంత్రణలో ఉంటారు. ఆకలి పెరిగి చక్కగా ఆహారం తినగలుగుతారు. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఎటువంటి వ్యాధులు రాకుండా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

ఆలస్యమైతే...

- నిద్ర సరిపోక కళ్లు, మెదడు అలసిపోతాయి. దీంతో పిల్లలు రోజంతా చిరాకుగా ప్రవర్తిస్తుంటారు. జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం, మలబద్ధకం లాంటివి ఎదురవుతాయి. కొంచెం పెద్ద పిల్లలకయితే ఏకాగ్రత కుదరదు. చదివిన అంశాలు గుర్తుండవు. పరీక్షలు సరిగా రాయలేక నిరాశ, ఆందోళనలకు గురవుతూ ఉంటారు. పిల్లలు ఆలస్యంగా పడుకుని, ఆలస్యంగా నిద్రలేస్తుంటే తల్లిదండ్రులు గమనించి ఆ అలవాటును మానిపించాలి.

ఏ సమయానికి పడుకోవాలంటే...

- చిన్న పిల్లలు రాత్రి ఎనిమిదింటికల్లా పడుకోవడం మంచిది. బడికి వెళ్లే పిల్లలు రాత్రి తొమ్మిదిలోపు పడుకోవాలి. కనీసం ఎనిమిది నుంచి పది గంటలపాటు నిద్రించడం వారి ఆరోగ్యానికి మంచిది.

వంటిల్లు

కృష్ణునికి అటుకులు, పాలు, మీగడ, వెన్న అంటే ఇష్టమని మనందరికీ తెలుసు. కృష్ణాష్టమి రోజున వీటితో రకరకాల వంటకాలు తయారుచేసి కృష్ణునికి నివేదిస్తూ ఉంటాం. తక్కువ సమయంలో తేలికగా అటుకులతో తయారుచేసే రుచికరమైన నైవేద్యాల గురించి తెలుసుకుందాం...



అల్లరి కృష్ణునికి అటుకుల నైవేద్యం..!

• పాలు చిలకరించకుండా మరో నాలుగు చెంచాల నెయ్యి వేసి చేస్తే లడ్డూలు చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి.

అటుకుల లడ్డు

కావాల్సిన పదార్థాలు

అటుకులు- రెండు కప్పులు, నెయ్యి- అయిదు చెంచాలు, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని, ఎండు కొబ్బరిపొడి- రెండు చెంచాలు, యాలకులు- మూడు, తురిమిన బెల్లం- ముప్పావు కప్పు, కాచి చల్లార్చిన పాలు- మూడు చెంచాలు

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో అటుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. వాటిని చల్చార్చాలి. స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పలుకులు వేసి ఎర్రగా వేయించాలి. తరవాత ఎండు కొబ్బరి పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- మిక్సీలో చల్లారిన అటుకులు, యాలకులు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత బెల్లం తురుము వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జీడిపప్పు-బాదం పలుకుల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. అందులో మూడు చెంచాల నెయ్యి వేసి కొద్దికొద్దిగా పాలు చిలకరిస్తూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దికొద్దిగా తీసుకుంటూ లడ్డూలు చుట్టుకోవాలి. అంతే..! కృష్ణునికి ఎంతో ఇష్టమైన అటుకుల లడ్డు రెడీ..!

• అటుకులను చిన్న మంట మీద నెమ్మదిగా వేయించుకోవాలి. లేదంటే తొందరగా మాడిపోతాయి.

అటుకులు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

అటుకులు- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, బెల్లం- ఒకటింబావు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, కాచి చల్లార్చిన పాలు- మూడు కప్పులు, యాలకుల పొడి- అర చెంచా, కొబ్బరి ముక్కలు- కొన్ని, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పప్పులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో పెసరపప్పు వేసి దోరగా వేయించి మరో గిన్నెలోకి తీయాలి. అందులో నీళ్లు పోసి పెసరపప్పును రెండుసార్లు కడగాలి. తరువాత రెండు కప్పుల నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి పావుకప్పు నీళ్లు పోయాలి. బెల్లం పూర్తిగా కరిగిన తరవాత స్టవ్ మీద నుంచి దించి మరో గిన్నెలోకి వడబోయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు పలుకులు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత అటుకులు వేసి, దోరగా వేయించి మరో పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో నానబెట్టిన పెసరపప్పును నీళ్లతో సహా వేసి ఉడికించాలి. మధ్యలో ఒక చెంచా నెయ్యి వేసి కలపాలి. పెసరపప్పు మెత్తగా ఉడికిన తరువాత వేయించిన అటుకులు వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలపాలి. మళ్లీ గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు మిశ్రమాన్ని ఉడికించాలి. అదే సమయంలో... వేయించి పెట్టుకున్న కొబ్బరిముక్కలు, జీడిపప్పు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లతోపాటు యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. అంతే! కమ్మని అటుకులు-పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ!

• పాయసాన్ని జారుగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి. అది చల్లారిన తరవాత కొద్దిగా గట్టిపడుతుంది.



• బెల్లం నీళ్లు పూర్తిగా చల్లారిన తరవాతనే పాలు-అటుకులు-పెసరపప్పు మిశ్రమంలో కలపాలి. లేదంటే పాలు విరిగిపోవచ్చు.

• అటుకుల్లో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ప్రొటీన్లు, పిండిపదార్థాలు, ఐరన్, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అటుకులను తరచూ తినడం వల్ల నీరసం తగ్గుతుంది. రక్తహీనత, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు దరిచేరవు. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. అటుకుల్లో క్యాలరీలు, కొవ్వులు ఉండవు కాబట్టి ఎక్కువగా తిన్నప్పటికీ శరీరం బరువు పెరగదు. ఇవి త్వరగా జీర్ణమవుతాయి. అందుకే అటుకులను పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు బలవర్థకమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు.

సంకల్పం

నాట్యం... పరవశం

మూడు గంటలు భరతనాట్యం... మధ్యలో పావుగంట విరామం...
అలా ఏకధాటిగా 170 గంటల ప్రదర్శన..! సాధ్యమేనా..? అందరిదీ ఇదే సందేహం.
కానీ... అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించింది ఇరవయ్యేళ్ల రెమోనా ఎవెట్టే పెరీరా.
అమ్మ అండతో... స్నేహితులు, సన్నిహితుల ప్రోత్సాహంతో... ఈ మెగా ఫీట్‌ను దిగ్విజయంగా ముగించి...
'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించిన రెమోనా కథ ఇది.



"మాటల్లో చెప్పలేని భావాలను నాట్యంతో వ్యక్తీకరించవచ్చు. సంప్రదాయ నృత్యంలోని గొప్పదనం అదే. కాళ్లకు గజ్జె కట్టి, శరీరం లయబద్ధంగా కదులుతున్నప్పుడు నన్ను నేను మరిచిపోతాను. నర్తిస్తున్నంతసేపూ ఏదో తెలియని పరవశానికి లోనవుతాను. నేను అమితంగా ఇష్టపడింది, తొలిసారి ప్రేమలో పడింది భరతనాట్యంతోనే. కర్ణాటక రాష్ట్రం మంగళూరు నగరం మాది. ఊహ తెలియనప్పుడే మా అమ్మ నన్ను తీసుకువెళ్లి భరతనాట్యం గురువుకు అప్పగించింది. ఇక అప్పటి నుంచీ నాకు అదే లోకం అయిపోయింది. దీని వెనుక ఒక చిన్న కథ ఉంది. సంప్రదాయ నృత్యం అభ్యసించాలని మా అమ్మ ఎన్నో కలలు కన్నది. కానీ సామాజిక కట్టుబాట్ల పేరుతో ఇంట్లోవాళ్లు అనుమతించలేదుట. అందుకే నాకు కళలు నేర్పించాలని నిర్ణయించుకుంది. కానీ భరతనాట్యం వైపు వెళ్లమని తను నన్ను బలవంతం పెట్టలేదు. దీంతో పాటు పెయింటింగ్, ఇతర నాట్య రీతులు కూడా ఆరంభంలో సాధన చేశాను. అయితే ఎందుకో తెలియదు... అన్నిటికంటే నన్ను భరతనాట్యమే అమితంగా ఆకర్షించింది.



ఆలోచన అలా వచ్చింది...

ఆరంభం నుంచీ మా గురువు శ్రీవిద్య మురళీధర్ గారి దగ్గరే నాట్యం అభ్యసిస్తున్నాను. భరతనాట్యం నాకు ఒక సంప్రదాయ నృత్య సాధన మాత్రమే కాదు... భావోద్వేగాల బంధం. ఆధ్యాత్మిక అనుబంధం. నేను వేరు, నాట్యం వేరు కాదు. ప్రస్తుతం నేను బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. విద్య ఎంత ముఖ్యమో కళ కూడా అంతే ముఖ్యం. అందులో ఎప్పుడూ ఏదో కొత్తగా చేయాలని తపిస్తుంటాను. అలా ఒక రోజు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుంటే... 'డ్యాన్స్ మారథాన్' అని కనిపించింది. అలాంటిది ఒకటి ఉంటుందని కూడా అప్పటివరకు నాకు తెలియదు. ఆశ్చర్యం కలిగింది. నన్ను బాగా ఆకర్షించింది. 'నేను ఎందుకు ప్రయత్నించకూడదు' అనిపించింది.

అనుకున్నది 24 గంటలే... కానీ...

ఎప్పుడైతే ఆలోచన వచ్చిందో వెంటనే కార్యరంగంలోకి దిగాను. డ్యాన్స్ మారథాన్‌కు సంబంధించిన అప్లికేషన్ మా కాలేజీవాళ్లు తెప్పించారు. ముందుగా అనుకున్నది 24 గంటల మారథాన్. కానీ అప్లికేషన్ నింపుతుంటే... 170 గంటలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ సంఖ్య నా మదికి ఎలా తట్టిందో తెలియదు. దరఖాస్తులో రాసే ముందు అమ్మకు చెప్పాను. తను అవాక్కయింది. కాసేపటికి తేరుకొని... 'అంటే ఎన్ని రోజులు' అని అడిగింది. 'సుమారుగా ఏడు రోజుల రెండు గంటలు' అన్నాను. ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ... 'నిజంగానే చేద్దామనుకొంటున్నావా' అంటే... 'అవును' అని బదులిచ్చాను. మరో ఆలోచన లేకుండా... 'అయితే నా మద్దతు నీకు ఉంటుంది' అంది అమ్మ.

ప్రత్యేక సన్నాహకాలు లేకుండానే...

ఈవెంట్‌కు కొన్ని వారాల ముందే 170 గంటలు నాన్‌స్టాప్‌గా భరతనాట్య ప్రదర్శన ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దాంతో సన్నాహకాలకు ఎక్కువ సమయం లేకుండా పోయింది. అయితే నా మనసులో ఒకటే అనుకున్నా... 'వారం రోజుల పాటు నిద్ర ఉండదు. కనుక దానికి ముందు బాగా నిద్ర పోవాలి' అని. ఈ మారథాన్ కోసం నేను సన్నద్ధమైంది ఏదైనా ఉందంటే... అది కంటి నిండా కునుకు తీయడమే. చివరకు ఈవెంట్ రోజు, అంటే జూలై 21 వచ్చేసింది. ప్రదర్శన మొదలుపెట్టాను. మా కాలేజీ ఆడిటోరియంలోనే. నాకు తెలుసు... మొదటిరోజు హాయిగానే సాగిపోతుందని. మూడో రోజు నుంచి కష్టపడాల్సి వస్తుందని అనుకున్నా. కానీ నా అంచనాలు తలకిందులు అయ్యాయి. తొలి రోజే ఆపేద్దామనుకున్నా. అమ్మ 'నువ్వు చేయగలవు' అని ఆత్మవిశ్వాసం నింపింది. ఆడిటోరియంలో నా స్నేహితులు, స్థానికులు, అధ్యాపకులు... అందరూ నాకు అండగా నిలిచారు. నాకు నిద్ర వచ్చినప్పుడల్లా... చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ ఉత్సాహపరిచారు. మూడు గంటల నాట్యం... మధ్యలో పావుగంట విరామం. ఎక్కువగా అరటి, ఆపిల్, జామపండ్లు, కొబ్బరి నీళ్లతోనే సరిపెట్టుకున్నా. నిద్ర మరీ ముంచుకొస్తే ఒకటి రెండు సిప్‌లు కాఫీ. రాత్రి అయ్యేసరికి విపరీతమైన వెన్ను, కాళ్ల నొప్పులు. తట్టుకోలేక కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అన్నిటి కంటే పెద్ద సవాలు... నిద్ర ఆపుకోవడం. అన్నిటినీ భరించాను. అందరి సహకారంతో జూలై 28న విజయవంతంగా మారథాన్ ముగించాను.

అమ్మ లేకపోతే నేను లేను...

నా జీవితంలోనే కాదు... నా ఈ నాట్య ప్రయాణంలోనూ మా అమ్మ పాత్ర ప్రముఖమైనది. వెల కట్టలేనిది. నా ప్రతి దశలో తోడై, అడుగడుగునా ప్రోత్సహిస్తూ వస్తోంది. అంతేకాదు... నాట్య ప్రదర్శనకు అవసరమైన దుస్తులు తనే డిజైన్ చేసి, కుడుతుంది. అమ్మ నా నిశ్శబ్ద భాగస్వామి. నన్ను నలుగురిలో గొప్పగా నిలబెట్టడానికి అహర్నిశలూ కష్టపడుతుంది. తను లేకపోతే నేను లేను. నా మారథాన్ సమయంలో అమ్మ కూడా నిద్ర పోలేదు. సరిగ్గా తినలేదు. నిరంతరం నన్ను అంటిపెట్టుకొనే ఉంది.

సరికొత్త రికార్డు...

నా ప్రదర్శన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. రికార్డు నెలకొల్పాననే ఆనందం కన్నా... అంత పెద్ద లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాననేదే నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం నాకు ఇదే మొదటిసారి కాదు. గతంలో పిల్లలకు ఇచ్చే అత్యున్నత అవార్డు... 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నాను. నేను ఎక్కడ ఉంటే అక్కడ భరతనాట్యం ఉండేలా కృషి చేస్తాను. ప్రస్తుతం ట్రాన్స్‌జెండర్స్, పిల్లలకు నృత్యం నేర్పిస్తున్నాను. భరతనాట్యంలో పీహెచ్‌డీ చేయాలనేది నా కల. తద్వారా ఈ కళారూపాన్ని మరింత లోతుగా అర్థంచేసుకొనే అకాశం లభిస్తుంది కదా."

వ్యక్తిగత గౌరవం పెరిగేలా...

మనం వ్యక్తిగతంగా ఎదగడానికి మన అలవాట్లే దోహదం చేస్తాయి. ఒక్కోసారి తెలిసీ తెలియక చేసే పొరబాట్లు నలుగురిలో నగుబాటుకి గురిచేస్తూ ఉంటాయి. అలాకాకుండా సమాజంలో ఉన్నతంగా నిలవాలంటే ఏవిధంగా మెలగాలో తెలుసుకుందాం...

- కొంతమంది వ్యక్తిగతమైన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. గంట గంటకూ కామెంట్లు, లైక్‌లు చూస్తూ ఉంటారు. అనుకున్నట్లు జరిగితే సంతోషమే. కానీ అలా కానిపక్షంలో భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోతూ ఉంటారు. దీనివల్ల మానసికంగా అశాంతి, అసహనం, కోపం పెరుగుతాయి. ఇవి వ్యక్తిగత గౌరవాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే సామాజిక మాధ్యమాల్లో గడపడాన్ని తగ్గించుకోవాలి.
- కొంతమంది ఎప్పుడూ ఎదుటివారిలో తప్పులు వెతుకుతూ ఉంటారు. చిన్న చిన్న అంశాలనే పెద్దవిగా చేసి అనవసరమైన గందరగోళం సృష్టిస్తూ ఉంటారు. అలాకాకుండా తప్పు అనిపించిన అంశాన్ని నేరుగా మృదువుగా చెప్పడం మంచిది. దీనివల్ల నలుగురిలో సానుకూలంగా వ్యవహరించడం అలవడుతుంది.



- వాయిదా వేసే ధోరణి చాలామందిలో కనిపిస్తూ ఉంటుంది. మీటింగ్ లేదా ఫంక్షన్‌కి వస్తానని చెప్పి ఆఖరు నిమిషంలో రానని చెప్పడం, చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు వాయిదా వేయడం లాంటివి వ్యక్తిగత గౌరవాన్ని తగ్గిస్తాయి. కాలయాపన చేయకుండా క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకోవాలి.

జాతీయ జెండాకు వందనం




ఏలూరు, భీమవరం కలెక్టరేట్‌లలో..

ఏలూరు సిటీ/భీమవరం టౌన్ ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధిని సాధిద్దామని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శుక్ర వారం జిల్లా కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.మహాత్మాగాంధీ విగ్ర హానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, కలెక్టరేట్ ఏవో నాంచా రయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం ద్వారా వచ్చిన హక్కులను పరిరక్షిస్తూ ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. ఏలూరు రేంజ్ కార్యాలయం వద్ద ఐజీ జెండా ఎగురవేశారు.



ఏలూరు జిల్లా కోర్టులో జడ్జి శ్రీదేవి..

ఏలూరు జిల్లా కోర్టుపై జాతీయ జెండాను జిల్లా జడ్జి శ్రీదేవి ఆవిష్క రించారు. అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సమాజంలో సమ న్యాయం అందించే బాధ్యత న్యాయశాఖపై ఉందని ప్రతిఒక్కరు నిజాయితీగా విధులను నిర్వర్తించాలని సూచించారు. న్యాయమూర్తులు, న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.




ఏలూరు, భీమవరం ఎస్పీ కార్యాలయాల్లో..

ఏలూరు క్రైం/ భీమవరం క్రైం : స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహ నీయులను ఆదర్శంగా తీసుకుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ సూచించారు. ఏలూరు ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన జేసీ ధాత్రి రెడ్డితో కలిసి జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించి స్వీట్లు పంచారు. భీమవరం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో అంకితభా వంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

ఏలూరుసిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జెండా ఆవిష్కరించారు.జిల్లా పరిషత్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన 108 మంది ఉద్యోగులకు జడ్పీ ఛైర్‌పర్సన్ ప్రశంసా పత్రాలను అందజేశారు. జడ్పీ సీఈవో శ్రీహరి, డిప్యూటీ సీఈవో భీమేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో..



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించు కోవాలని ఏపీ నిట్ డీన్ రిసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీ.రవికిరణ్ శాస్త్రి అన్నారు. నిట్‌లో ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ రమణారావు ఆధ్వ ర్యంలో జాతీయ జెండా ఆవిష్క రించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిజి స్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ హిమబిందు, డాక్టర్ సందీప్, డాక్టర్ జయరాం, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు

పెదకృష్ణంరాజుకు విశిష్ట సేవా అవార్డు



పెంటపాడు, ఆగస్టు 15 (ఆంధ్ర జ్యోతి): అలంపురంలో శ్రీవెంకటరమణ సేవా చారి టబుల్ ట్రస్టు పేరుపై ఆసు పత్రిని ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ట్రస్టు చైర్మన్ డాక్టర్ కొలనువాడ పెద కృష్ణంరాజును మరో అవార్డు వరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సంద ర్భంగా శుక్రవారం మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా విశిష్ట సేవా అవార్డు అందుకున్నారు.




భీమవరం వేడుకల్లో వ్యవసాయ శాఖ శకటం



భీమవరంలో విద్యార్థుల ప్రదర్శన

జయహో భారత్

79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ఉమ్మడి జిల్లా అంతటా ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాల యాల్లో జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. ఏలూరు, భీమవరం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ విభాగాలు తమ అభివృద్ధిని తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించారు.

ఉత్సాహంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం

ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలూరు రూరల్, ఆగస్టు 15, (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో నిర్వహించిన వేడుకల్లో నూజివీడుకు చెందిన త్రివిధ ఉన్నత పాఠశాల 60 మంది విద్యా ర్థినీ, విద్యార్థులతో ప్రదర్శించిన "వందనాలు, వందనాలు..వీర భారతీపు త్రులారా" అంటూ ప్రదర్శించిన నృత్య ప్రదర్శన, భీమడోలు మండలం పోల సానిపల్లికి చెందిన ఏపీ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల విద్యా ర్థులు ప్రదర్శించిన "జయహో" ప్రదర్శన, ఏలూరులోని కస్తూరిబా మున్సి పల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 225 మంది విద్యార్థినులు ఇటీవల పెహల్గామ్‌లో ఉగ్రదాడి, అనంతరం భారత సైన్యం "ఆపరేషన్ సింధూర్" పేరుతో టెర్రరిస్టులను మట్టుపెట్టిన సంఘటనతో రూపొందించిన ప్రదర్శనకు సభికులంతా కరతాళధ్వనులు చేశారు.గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్ ప్రభుత్వ వ్యాయమ ఉపాధ్యాయ శిక్షణా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన "మాల్కం" విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దీనికి మొదటి బహుమతి రాగా నూజివీడుకు చెందిన రైట్స్ సంస్థకు చెందిన బాలికలు ప్రదర్శించిన "హం ఇండియా వాలే" ప్రదర్శన రెండో బహుమతి, ఏలూరులోని కస్తూరిబా పాఠశాల "ఆపరేషన్ సింధూర్" ప్రదర్శనకు మూడో బహుమతి, కలిదిండి పబ్లిక్ స్కూల్‌కి వందే మాతరం నృత్య ప్రదర్శనకు నాల్గవ బహుమతి లభించాయి.

భీమవరం టౌన్, (ఆంధ్రజ్యోతి) : భీమవరం పెరేడ్ గ్రౌండులో శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యాశాఖ ప్రథమస్థానం, పశుసంవర్ధక శాఖ ద్వితీయస్థానం, వైద్య ఆరోగ్య శాఖకు తృతీయ స్థానాలు లభించాయి.వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలకొల్లు భారతీయ విద్యాభావన్స్ విద్యార్థుల వందేమాతరం, భీమవరం ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల జై జవాన్.. జై కిసాన్, భీమవరం ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన జగతి సిగలో జాబిలమ్మకు వందనం, తణుకు రూట్స్ పాఠశాల విద్యార్థుల వందేమాతరం, పెనుగొండ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిను హర్ ఘర్ తిరంగా, తణుకు మాంటిస్సోరి విద్యార్థులు ప్రదర్శించిన ఇది మన భారతం, భీమవరం పీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్, భీమవరం వైష్ణవి అకాడమీ, కాళ్ల వెస్ట్ బెర్రీ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు. ఆకట్టుకున్నాయి. తణుకు రూట్స్ విద్యార్థుల ప్రదర్శించిన వందేమాతరం ప్రథమ స్థానం, పెనుగొండ విద్యార్థులు ప్రదర్శించిన హర్ ఘర్ తిరంగా ప్రదర్శనకు ద్వితీయస్థానం, భీమవరం ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు జై జవాన్..జై కిసాన్ ప్రదర్శనకు తృతీయస్థానం లభించాయి.




విద్యార్థుల బ్యాండ్ విన్యాసాలు



ఏలూరులో జరిగిన వేడుకల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన ప్రదర్శనలు






భీమవరంలో జరిగిన వేడుకల్లో రెండు, మూడు బహుమతులు సాధించిన 'హర్ ఘర్ తిరంగా, జై జవాన్ జై కిసాన్..' ప్రదర్శనలు



భీమవరం మావుళ్లమ్మ ఆలయం వద్ద సామూహిక పూజల్లో భక్తులు

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

భీమవరం టౌన్/ పెంటపాడు/ పెనుగొండ/ తాడేపల్లిగూడెం రూరల్ ,ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం శుక్రవారం పుర స్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో మావుళ్ళమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చ కుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దాదాపు వెయ్యి మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులకు మావుళ్ళమ్మ అమ్మ వారి పుట్టింటివారు మెంటే వంశస్థులు చీరలు బహుకరించారు. ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ కనక దుర్గమ్మ ఆలయంలో సామూ హిక వరలక్ష్మి వ్రతాలు నిర్వ హించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పెనుగొండ వాసవీ మాత ఆల యంలో వరలక్ష్మి పూజ వేడుకగా నిర్వహించారు. సుమారు 600 పైగా మహిళలు పాల్గొ న్నారు. తాడేపల్లిగూడెం మండలం నీలా ద్రిపురం గ్రామ దేవత చల్లాలమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు.



ప్రత్తిపాడు కనకదుర్గమ్మ ఆలయంలో..



నీలాద్రిపురం చల్లాలమ్మ ఆలయంలో..



పెనుగొండ వాసవీమాత ఆలయంలో..

జుత్తిగ అమ్మవారి ఆలయంలోకి వరద నీరు



పెనుమంత్ర, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పెను మంత్ర మండలంలో ప్రధానంగా ప్రవహించే గోస్తనీ నది పోటెత్తడంతో జుత్తిగ కామాక్షి అమ్మ వారి ఆలయంలో వరదనీరు చేరింది. శ్రావణ శుక్రవారం అమ్మ వారిని దర్శించుకునేందుకు వెళ్లిన మహిళా భక్తులుకు అంతరాయం ఏర్పడింది. వరద నీటిలోనే అమ్మవారిని దర్శించుకున్నారు.



గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భవన శంకుస్థాపనలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ఆరిమిల్లి తదితరులు

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భవనానికి శంకుస్థాపన

భీమవరం టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలో మావుళ్ళమ్మ గుడి దగ్గరలోఉన్న గ్రామ కచేరి చావిడి స్థలంలో జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు రాజ్యసభ సభ్యుడు పాక సత్య నారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర మహిళా ఆర్థిక సాధికార కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత తదితరులు పాల్గొన్నారు.

చినవెంకన్నను దర్శించుకున్న మంత్రి పార్థసారథి



చిత్రపటం అందచేస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ, సమా చార పౌర సం బంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి ద్వారకా తిరుమల వేంకటేశ్వ రస్వామిని శుక్రవారం దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. ఈవో మూర్తి స్వామి,అమ్మవార్ల చిత్రపటం,ప్రసాదాలను అందజేశారు.



కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ఘనంగా ఎమ్మెల్యే ముప్పిడి జన్మదిన వేడుకలు

కొవ్వూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంక టేశ్వరరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్ట ణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కొవ్వూరు నియోజ కవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణారావు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చై ర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామ కృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, నారాయణ, శ్రీనివాసరావు, మద్దిపట్ల సురేష్, ఆళ్ల హరిబాబు,సురేష్, గెల్లా సురేష్, రంగా రావు, సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు

డివైడర్‌ను ఢీకొట్టి యువకుడి మృతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ముందు వెళ్తున్న మోపెడ్‌ను తప్పించబోయి అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మోపెడ్‌పై వెళ్తున్న మరో వ్యక్తి కంగారుపడి రోడ్డుపై పడ టంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఈఘటన మండలంలోని సూర్య చంద్రరావు పేటలో శుక్రవారం సాయంత్రం జరిగింది. భీమడోలుకు చెందిన మీసాల జగదీష్ (23)ద్వారకాతిరుమలలోని ఓ స్వీట్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. ఉదయం డ్యూటీకి వచ్చిన జగదీష్ ఆరోగ్యం బాగో లేదని స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. ఘటనాస్థలం వద్దకు వచ్చేసరికి ముందువెళ్తున్న మోపెడ్‌బండిని ఓవర్ టేక్ చేసే సమయంలో బైక్ అదుపుతప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో జగదీష్ తలకుతీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మోపె డ్‌పై వెళ్తున్న పాకలపాటి ఫణీంద్ర కంగారుపడి కింద పడిపోవడంతో తీవ్రగాయలయ్యాయి. అతన్ని అంబులెన్స్‌లో భీమడోలు ఆసుపత్రికి తరలించారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన కారు..ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుర్ల మహేష్ కుమార్ (ఫైల్ ఫోటో)

ఉంగుటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కైకరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. నారాయణపురంలోని ఒక ఫ్యాక్టరీలో విధి నిర్వహణ నిమిత్తం వెళు తున్న మోటారు సైక్లిస్టును వెనుక నుంచి ఎర్టిగా కారు ఢీకొన డంతో మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం భీమడోలు మండలం మల్కి మహ్మద్‌పురం గ్రామానికి చెందిన బుర్ల మహేష్ కుమార్ శుక్రవారం ఉదయం నారాయణపురం వెళుతుడగా కైకరం శివారులో ద్వారకా తిరు మల నుంచి తణుకు వెళుతున్న ఎర్టిగా కారు వెనుక నుంచి ఢీకొట్టి పక్క నున్న పంట బోదెలోకి దూసుకుపోయింది. మోటారు సైక్లిస్టు మహేష్ కుమార్ (37) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్ఐ మామిడాల సూర్య భగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బిల్లుల మంజూరుకు డీటీవోతో చర్చలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అందాల్సిన ఆర్థిక బకాయి బిల్లులపై యూటీఎఫ్ జిల్లానాయకులు జిల్లా ఖజానా అధికారి శ్రీనివాసరావుతో శుక్రవారం చర్చించారు. ఏలూరు మండలాల బిల్లులను అప్రూవల్‌చేయడానికి డీటీవో హామీ ఇచ్చారని సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి రవికుమార్ తెలిపారు. యూటీఎఫ్ నాయకులు మోహన్, ప్రసాద్, శ్రీదర్, జిక్రియ, సత్యనారాయణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జల్లేరు వాగులో భారీ చేపలు



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వేగవరం సమీపంలోని జల్లేరు వాగులో భారీ చేపలు వలకు చిక్కుతున్నాయి. శుక్రవారం సుమారు 20 కిలోలున్న రెండు బొచ్చె చేపలు వలలో పడ్డాయి. పట్టణానికి చెందిన మువ్వా అభిరామ్ రెండు చేపలను రూ.10 వేలకు కొనుగోలు చేశారు. వర్షాలతో చేపలు జల్లేరు కాలువ నుంచి ఎర్రకాలువ జలాశయంలోకి చేరుతున్నాయి.





నృసింహినీదేవిగా కనకదుర్గాంబ, లక్ష్మీగణపతికి జాతీయ జెండాతో అలంకారం

శ్రావణ పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. అమ్మవారు వేర్వేరు అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వయంభూ సౌభాగ్యలక్ష్మీ దేవి విద్యా లక్ష్మీదేవిగా, బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ నృసింహినీదేవిగా, పత్తేబాదలోని కనకదుర్గాంబకు నిమ్మకాయలతో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సత్రంపాడు లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో స్వామివారిని జాతీయ జెండాలతో అలంకరించారు. జాతీయ జెండాలతో అలంకరించిన లక్ష్మీగణపతిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టడం విశేషం.

పత్తేబాద కనకదుర్గమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించగా 144 రోజులకు రూ.1,52,986, చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కించగా రూ.1,36,849, విఘ్నేశ్వరస్వామి ఆలయ హుండీలో రూ.45,422 ఆదాయం వచ్చినట్టు ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు.

● కామవరపుకోట: లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి వరలక్ష్మీవ్రతాలు నోచుకున్నారు. లలితాదేవి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, గోత్రనామాలతో పూజలు జరిపారు. పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్యశ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.



సొసైటీ చైర్మన్ హరిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

ద్వారకాతిరుమల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. తిరుమలంపాలెం సొసైటీ చైర్మన్‌గా మాచిరెడ్డి హరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రాజు హరిబాబుకు స్వామివారి చిత్రపటం ఇచ్చి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల, రామన్నగూడెం, జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్లు పోలిన శ్రీనివాసరావు, మద్రాస్ రాము, రేగంటి రాంబాబు, లంకా సత్తిపండు, మొగతడకల శ్రీనివాసరావు, పావులూరి నెహ్రూ, నాదెళ్ల సురేంద్రనాథ్‌చౌదరి, ఏపూరి దాలయ్య, మటపర్తి బద్రి, ఓంప్రకాష్‌చౌదరి, ఇమ్మడి రత్నాజీ, దేవరపల్లి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆది ధర్మారావు

చింతలపూడి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సీతానగరం సొసైటీ చైర్మన్‌గా ఆది ధర్మారావు, సభ్యులుగా వినోద్‌కుమార్, వీరాస్వామి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ సీతానగరం సొసైటీ లాభాల్లో ఉందని, మరింత లాభాల బాటలోకి తీసుకురావాలన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా రైతులు కె.రాంబాబు రూ.5లక్షలు, వీరాస్వామి రూ.2లక్షలు, పౌల్‌రాజు రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్మన్‌గా నాగరాజు

టి.నరసాపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్మన్‌గా అడపా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా మధ్యాహ్నపు వేణు, తేతలి నాగదుర్గారావు ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అందరు సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు నడుస్తానని అన్నారు. కార్యక్రమంలో భుజంగరావు, కూటమి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వ్యవసాయశాఖ, గృహనిర్మాణశాఖ శకటాలు

మాది సుపరిపాలన

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నాం. స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి, పర్యావరణ సుస్థిరతలపై దృష్టి సారించి 2047 నాటికి భారతదేశానికి ఏపీ ప్రధాన వృద్ధి కేంద్రంగా మార్చడానికి ప్రణాళిక, కార్యాచరణ నిర్దేశిస్తుంది' అన్నారు.

కుడికాలువ పూర్తి చేస్తాం..

పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ పనులు 92.79 శాతం పూర్తి చేయడమే కాకుండా కృష్ణా డెల్టా ఆయకట్టును సంరక్షించేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 442 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్లించాం. తాడిపూడి ఎత్తిపోతల ప్రధాన పంప్ హౌస్‌ల పనులు పూర్తి చేయడమే కాకుండా 1,57,544 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాం. జలవనరుల శాఖ ద్వారా ఓఅండ్‌ఎం పథకం కింద రూ.9.11 కోట్లతో తూడు తొలగింపు పనులు పూర్తి చేశాం. జపాన్ బ్యాంక్ ఆర్థిక సాయంతో తమ్మిలేరు ప్రాజెక్టు మోడర్నైజేషన్‌కు రూ.16.8 కోట్లతో పనులు పురోగతిలో ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం రావులచెరువును రూ.94 లక్షలతో అభివృద్ధి చేశాం. జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో 82,108 గృహాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో 19,581 గృహాలు, పీఎం జన్‌మన్ పథకంలో 556 గృహాలు మొత్తం మీద లక్షా 32 వేల 237 గృహాలను రూ.1,840.27 కోట్లతో మంజూరు చేశాం. ఇంతవరకు 44,533 గృహాల నిర్మాణం పూర్తి చేశాం. 2014-19 మధ్య మంజూరు కాబడిన పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులను దశలవారీగా చెల్లిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఈ విధానాన్ని ఈరోజే తీసుకొస్తున్నాం. వాట్సప్ నంబర్ 95523 00009 ద్వారా 700 సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలి' అంటూ మంత్రి విజ్ఞప్తి చేశారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ నూర్జహాన్



భీమడోలులో స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే ధర్మరాజు



ఐటీడీఏ వద్ద దేశ నేతల విగ్రహాలకు పీవో నివాళి



కొవ్వలి జడ్పీ హైస్కూల్ వద్ద చింతమనేని జెండా వందనం

మువ్వన్నెల పతాకం రెపరెపలు

● ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు ● జాతీయ పతాకం ఆవిష్కరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఏలూరు రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ షేక్ నూర్జహన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దడానికి నగర ప్రజలు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, డిప్యూటీ కమిషన్ బి.శివారెడ్డి, మునిసిపల్ ఎంఈ సురేంద్రబాబు, అధికారులు, పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో వెన్న శ్రీలత, తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎంహెచ్ఏ, సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్, దొండపాడు పరివర్తన పాఠశాలలో స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● ఏలూరు అర్బన్: నగరంలోని పలు విద్యా సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు జాతీయపతాకాన్ని ఎగురవేసారు. రవికుమార్, రంగమోహన్, తదితరులు పాల్గొన్నారు. పత్తేబాద రైతుబజార్ సమీపంలోని బృందావనం పార్కు, వాకర్స్ అసోసియేషన్, అశోక్‌నగర్ శుభోదయం పార్కుల్లో త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో ఉత్తమ సేవలందించిన ఎస్.నాగమణి, యు.గోపాలరావును సత్కరించారు. వాకర్స్ క్లబ్ నాయకులు ఎం.రాఘవేంద్రరావు, మల్లికార్జునరావు, మోహన్‌రావు, రాంబాబు, నిర్మలకుమారి, తదితరులు పాల్గొన్నారు. శనివారపు పేట ఎంపీపీఎస్-1 స్కూలు హెచ్‌ఎం ఎం.రాధిక నేతృత్వంలో జరిగిన వేడుకల్లో ఎస్ఎంసీ చైర్మన్ లూకా, లోవరాజు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రటరీ దుష్యంత్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు. సీఆర్ రెడ్డి పబ్లిక్‌స్కూలులో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి పాల్గొన్నారు.

● పెదపాడు: మండలంలో స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తహసీల్దారు కృష్ణజ్యోతి, డీసీ అధ్యక్షుడు బొప్పుడి కాశీబాబు జాతీయ జెండా ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి జెండా ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పెదపాడు సొసైటీలో త్రిసభ్య కమిటీ చైర్మన్ గారపాటి స్టాలిన్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో సబ్బితి నరసింహ మూర్తి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కట్టా శారదా సతీష్, ఐసీడీఎస్ కార్యాలయంలో పాతిమా బేగం జెండా ఎగురవేశారు. ఎంపీడీవో అమీలుజమ, సీఈవో డీవీ సుబ్బారావు, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. ఆస్పత్రిలో స్కానింగ్ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యుడు సుందరిబాబు, చైర్మన్ కలపాల శ్రీహరి, సర్పంచ్ ఏసమ్మ, సొసైటీ అధ్యక్షుడు కొండయ్యచౌదరి, సంపంగి వేణుగోపాల తిలక్, యిప్పిలి వెంకటేశ్వరరావు, పెనుబోయిన మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో చింతమనేని జాతీయ జెండా ఆవిష్కరించారు. హెచ్ఎం.శర్మ, మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ప్రకాష్, తహసీల్దారు సుబ్బారావు, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ సుధీర్, శ్రీవారి దేవస్థానం ఆవరణలో ఈవో సత్యనారాయణమూర్తి, రాజుపాలెంలో సర్పంచ్ దేవరపల్లి నరసమా దేవి, జాతీయ జెండా ఎగురవేశారు.

● బుట్టాయగూడెం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో జాతీయ జెండా ఎగురవేశారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, కేఆర్.పురం ఐటీడీఏలో పీవో కె.రాములు నాయక్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కారం శాంతి జాతీయ జెండా ఎగురవేశారు. ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ వీవీ చలపతిరావు, అధికారులు, ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: తహసీల్దారు ఉదయ్‌భాస్కర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొర్స పోసమ్మ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బర్రింకలపాడు క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. పంచాయితీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండా ఆవిష్కరించారు. వీఆర్ఏగా ఉత్తమ ప్రతిబ కనబరిచిన ఎస్‌కె. షరీఫ్ ఆర్డీవో ఎంవి.రమణ నుంచి ప్రశంసాపత్రం అందుకోవటంతో పలువురు అభినందించారు. ఎంపీడీవో టి.నిఖిల్‌మధుశరణ్, ఎంఈవో కె.శ్రీనివాస్, జడ్పీటీసీ ఎం.వసంత్, హెచ్‌ఎం.రాజు, డీటీలు పెద్దిరాజు, ఎస్‌వీ.రమణ, వీఆర్వోలు, సర్పంచ్‌లు వనమ రాంబాబు, చిర్రి జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మేడబడి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. అక్కడి నుండి నగర పంచాయితీ కార్యాలయం, సొసైటీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఏరియా ఆసుపత్రి వద్ద సూపరింటెండెంట్ ఎ.నారాయణరావు పతాకావిష్కరణ జరిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాంబాబు జెండా ఆవిష్కరించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వజ్రపు శేఖర్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్‌లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా జెండా ఆవిష్కరించారు. పాఠశాలల్లోను, డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో పతాకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి.

● కామవరపుకోట: కొత్తూరులోని సచివాలయం వద్ద ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ, ఖాన్ వజీర్, షేక్ వల్లీ తదితరులు పతాకావిష్కరణలో పాల్గొన్నారు. జనసేన, టీడీపీ, బీజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎం.సరళకుమారి, ఎంఈవో డి.సుబ్బారావు, ఏవో ఎం.ముత్యాలరావులు జాతీయ పతాకాలను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. సర్పంచ్ కరిపోతు అనూష పాల్గొన్నారు.

● భీమడోలు: గ్రామాల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ధర్మరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. సొసైటీలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు జాతీయ జెండాను ఎగురవేశారు. సివిల్ కోర్టు ఆవరణలో జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిఇగాయి. పోలసానపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం జాతీయ జెండాను ఎగురవేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి.

● కొయ్యలగూడెం: స్వాతంత్ర్య వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జెండాలు ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నాగరాజు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంజిమాల రామారావు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంద్రశేఖర్, ఇరిగేషన్ కార్యాలయంలో డీఈ అన్ని పంచాయతీల్లోని సర్పంచ్‌లు, జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణం, మండలంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో ఎంవీ.రమణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వీఆర్వోలు, రెవిన్యూ కార్యాలయ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేశారు. కోర్టు వద్ద న్యాయాధికారి సీహెచ్.కిశోర్ కుమార్, డీఎస్పీ కార్యాయంలో డీఎస్పీ యు.రవిచంద్ర, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, మునిసిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కృష్ణప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య జాతీయజెండా ఎగురవేశారు. వైసీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు చోట్ల ఆ పార్టీ నాయకులు జెట్టి గురునాథరావు జాతీయ జెండా ఎగురవేశారు. శ్రీనివాసపురంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకల్లో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. వెలగపాడు సీసీరోడ్డును ప్రారంభించారు. మల్లుకుంట సొసైటీ చైర్‌పర్సన్ శీలం సాయివినయ్ ఎంపీని గజమాలతో సత్కరించారు.

● వేలేరుపాడు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సంస్థల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవీన్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జెండాలు ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు అధ్యక్షుడు మాచర్ల హరిబాబు, ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొల్లూరి సత్తిపండు, రేపాకగొమ్ము గ్రామం పంచాయతీ వద్ద చోడే వెంకమ్మ, తాటుకూరుగొమ్ము పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఉదయ్‌కిరణ్, జడ్పీహైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, పతాకావిష్కరణ చేశారు. డాన్‌బాస్కో మదర్ థెరిసా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన ఎంపీడీవో ఎం.శ్రీహరి ఏలూరులో అవార్డు అందుకున్నారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

● లింగపాలెం: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో వీధులలో ర్యాలీ నిర్వహించి జాతీయగీతాలను ఆలపించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వాణి, ఎంఈవో రామారావు, రవీంద్ర, రత్నాకర్, క్రాంతికుమార్, విజయ్, పువ్వుల ఆంజనేయులు, ఎస్ఐ కె.వెంకన్న, ఏఎస్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా వందనం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. నారాయణపురం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెడ్డియ్య, కొండా రవి, నారాయణపురం, చేబ్రోలు, కైకరం ఉంగుటూరు, బాదంపూడి పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగిన జెండా వందనాల్లో సర్పంచ్‌లు దిడ్ల అలకనంద, రాంధే లక్ష్మీనునీత, సలగాల గోపి, కంకట పద్మలీల, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, అడపా శోభారాణి, ఎంపీడీవో రాజ్ మనోజ్, తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర వర ప్రసాద్, ఉంగుటూరు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండలంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై రాజారెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో నరసింహరావు, కుక్కునూరు పంచాయతీ కార్యాలయం వద్ద రావు మీన, పాఠశాలల్లో త్రివర్ణ జెండాను ఆవిష్కరించారు.



పెదపాడు ఎంపీడీవో కార్యాలయంలో..



కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో..



లింగపాలెంలో ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం





టీడీపీ జిల్లా కార్యాలయం, ఎంపీ క్యాంప్ కార్యాలయాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ మహేశ్ జెండావందనం



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి నేతల నివాళి

రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు

ఏలూరు రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగధనులు ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో నగర మేయర్ నూర్జహన్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, టీడీపీ నగరాధ్యక్షుడు చోడే వెంకటరత్నం, సెక్రటరీ రెడ్డి నాగరాజు, కోఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ క్యాంపు కార్యాలయంలో..

ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ జాతీయ నేతలను ఆదర్శంగా తీసుకుని మంచి ఆశయాలతో ముందుకు వెళ్లాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ఏలూరు కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పాత్ర మరువరానిదని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలియచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖర్, గౌడు రంగబాబు, కోసూరి చంద్రకాంతమ్మ, దాసరి రాంప్రసాద్, కొమ్మ సాంబశివరావు, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, చెక్క గుప్తా, సేవాదళ్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పార్థసారథి నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న డీపీఆర్వో కార్యాలయ సిబ్బంది, జీఎస్టీ అధికారి జవ్వాది అనురాధ మూర్తి

ఉత్తమ సేవలకు ప్రశంసలు

ఏలూరుసిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలకు గుర్తింపుగా డివిజనల్ పీఆర్వో సీహెచ్‌కె.దుర్గాప్రసాద్, ఫొటోగ్రాఫర్ పి.సాగర్, ఆఫీస్ సబార్డినేట్ ఎంఎం రేష్మా మంత్రి పార్థసారథి నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు అభినందించారు. జీఎస్టీ అధికారి అనురాధ మూర్తి కూడా ప్రశంసాపత్రం అందుకున్నారు.

వెయ్యి అడుగుల జాతీయ జెండా

కామవరపుకోట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆడమిల్లి గ్రామ సచివాలయం వద్ద నుంచి వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల, హైస్కూలు, డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. సర్పంచ్ గూడపాటి కేశవరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జి, మద్దిపాటి రామ్మోహన్‌రావు, మద్ది పాటి ఫణీంద్రరావు, రాణిమేకల మోహన్‌రావు, నల్లమిల్లి భుజంగరావు, తూంపాటి అబ్రహం తదితరులు విద్యార్థులతోపాటు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. భారతమాతకు జై నినాదాలతో ప్రదర్శన హోరెత్తింది.



వెయ్యి అడుగుల జెండాతో ప్రదర్శన

ట్రాక్టర్‌ను ఢీకొని గిరిజనుడి మృతి

బుట్టాయగూడెం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రెడ్డి గణపవరం సొసైటీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు కనుము గంగరాజు(55) మృతి చెందాడు. బెడదనూరుకు చెందిన గంగరాజు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా పుల్లల లోడు ట్రాక్టరును ఢీకొన్నాడు. గంగరాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతడికి నలుగురు పిల్లలు, భార్య లక్ష్మీ ఉన్నారు. ఎస్సై డి.దుర్గామహేశ్వరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **దెందులూరు :** దెందులూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ తోట ఏసమ్మ, సొసైటి అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి దుస్తులు, సబ్బులు, మాస్కులను అందజేశారు. ఎంసీటీసీ శేషారత్నం, భాస్కరరావు పాల్గొన్నారు.
- కొవ్వలిలో మత్స్య క్షేత్రాన్ని ఆక్వాల్యాబ్ అధికారి ఎం.భవిత పరిశీలించారు. మండల మత్యశాఖ అధికారి సతీష్ కుమార్ పాల్గొన్నారు.
- **ద్వారకాతిరుమల:** ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, టీడీపీ నేత ఇమ్మడి రత్నాజీ మ్యూజిక్ సిస్టమ్ బహుమతిగా అందజేశారు. సొసైటి చైర్మన్ పోలిన శ్రీను, ఏపూరి దాలయ్య, గువ్వల మావుళ్లు తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు అర్బన్:** స్థానిక శర్వాణి పాఠశాల ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణుని, గోపిక వేషధారణల్లో విద్యార్థులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు.
- **కుక్కునూరు:** అమరవరం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 2024 - 25 పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. మొదటి స్థానం సాధించిన సంజయ్ రూ.10వేలు, ద్వితీయ స్థానం పొందిన లహరికి రూ.5వేలు, 3వ స్థానం పొందిన ఎం.విష్ణుహర్షినికి రూ.2500నగదు అందజేశారు. గంజి రామచక్రధర్, పీ.రవీంద్రనాథ్ ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ రాధాకృష్ణ, సాంబశివరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో గౌరవ వందనం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న



కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో న్యాయమూర్తి వీవీఎస్‌వీ లక్ష్మి పతాకావిష్కరణ



కైకలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పతాకావిష్కరణ



నూజివీడులో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ముద్దరబోయిన నివాళులు



ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు



కలిదిండి మార్కెట్ యార్డులో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి పతాకావిష్కరణ



మండవల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మురిసిన మువ్వన్నెలు

»ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం »జాతీయ పతాకావిష్కరణలు » సమరయోధులకు నివాళులు

కైకలూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహనీయుల త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీ ఎస్వీ లక్ష్మి, జూనియర్ జడ్జి శివ కిరణ్ అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో వారు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గురజాడ ఉదయ్‌శంకర్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల పోరాట స్ఫూర్తిని నేటి యువతకు తెలియచేయాలన్నారు. ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్రాన్ని తీసుకువచ్చారని ప్రతి భారతీయుడు అమరవీరులను స్మరించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరహాపట్నంలో, భుజబలపట్నంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించి జాతీయ జెండాను ఎగురవేశారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో, కైకలూరు సర్పంచ్ కె.వి.ఎస్.ఎం. నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నేతలు బీకేఎం నాని, పెన్మెత్స త్రినాద్‌రాజు, పూల రామచంద్రరావు, వీరాబత్తిన సుధ, జానీ, కెకెబాబు, కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో పతాకావిష్కరణలు జరిగాయి.

కలిదిండి: కలిదిండి మార్కెట్ యార్డులో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణ, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్, కలిదిండి పంచాయతీ కార్యాలయంలో ఎం.మారుతీ ప్రసన్న జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ జాతీయ జెండాను ఎగురవేయగా, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, వడాలి హైస్కూల్‌లో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ముదినేపల్లి హైస్కూల్‌లో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ లతీఫ్ పాషా, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ వీరభద్రరావు, చిగురుకోట సొసైటీ వద్ద తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు జాతీయ జెండాలను ఎగురవేశారు. ముదినేపల్లి బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు పాల్గొన్నారు. వికాస్ కళాశాల కరస్పాండెంట్ మదన కిషోర్ స్థానిక మనోజ్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

మండవల్లి: సమరయోధులను స్మరించుకోవాలని మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ తెలిపారు. గాంధీ ఆశ్రమంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు. మండవల్లి, ఇంగిలిపాకలంక జడ్పీ హైస్కూళ్లలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందించారు. మండవల్లి ప్రధాన సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నివాళులర్పించింది.

నూజివీడు నియోజకవర్గంలో...

నూజివీడు టౌన్/నూజివీడు: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వినూత్న, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కేవీవీఎస్వీ ప్రసాద్, రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ రామకృష్ణ, టౌన్ సీఐ కార్యాలయంలో సీఐ సత్యశ్రీనివాస్, నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామ్‌శెట్టి త్రివేణిదుర్గ, నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్, ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో బద్రు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ పతాకావిష్కరణ గావించారు. నూజివీడులో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ స్వాతంత్ర ఫలాలు అట్టడుగు వర్గాలకు అందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయడంతో పాటు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలుపరుస్తున్నారన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి క్యాంప్ కార్యాలయంలో పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్ పతాకావిష్కరణ గావించారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఇతర నాయకులు ప్రధాన కూడళ్ళలో జాతీయ పతాకావిష్కరణ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్ళలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనూ నూజివీడు రాజీవ్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ పతాకావిష్కరణ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాగర్ కుమార్, కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు సోమరాజుల శివశంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యార్లగడ్డ ఆంజనేయులు, సూర్యదేవర ప్రసాద్ పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో ద్వారకా ఎస్టేట్ వద్ద వేడుకలు నిర్వహించారు.

చాట్రాయి: చాట్రాయి మండల పరిషత్, పీహెచ్‌సీలో ఎంపీపీ లంకా నిర్మల, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఉష, పోలీస్‌స్టేషన్‌లో ఎసై రామకృష్ణ, చాట్రాయి, చనుబండ పీఏసీఎస్‌లలో చైర్మెన్లు తుమ్మల రామ్మోహనరావు, మోరంపూడి శ్రీనివాసరావు, చీపురుగూడెం పాల సహకార సంఘంలో విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, చిత్తపూరులో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి హరనాథ్ జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. చనుబండలో బీజేపీ జిల్లా నాయకుడు బుర్రి శ్రీకర్ ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు ఓబిశ్శనేని రాజా, మోరంపూడి శ్రీనివాసరావు, చాగంటి వాసు, సిహెచ్ శ్రీనివాసరావు, కందుల కృష్ణ, మారేశ్వరరావు, సిహెచ్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: సమరయోధుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. ముసునూరు సచివాలయం వద్ద సర్పంచ్ కె.విజయలక్ష్మి, మండల కార్యాలయంలో ఎంపీపీ దుర్గాభవాని, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ దాసరి ప్రశాంతి, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.చిరంజీవి, విద్యాశాఖ భవనం వద్ద ఎంఈవో సుబ్బారావు, పీహెచ్‌సీల్లో వైద్యులు రమ్య, ఇవాంజలిలు, వెలుగు కార్యాలయంలో ఏపీఎం రాంబాబు, ఉపాధి కార్యాలయంలో ఏపీవో రోజ్‌లీల, గురుకుల బాలికల పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.పంగిడియ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే పాఠశాలల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు, గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌లు, సొసైటీల వద్ద సొసైటీ అధ్యక్షులు పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కె.రాజా, ఎంపిడివో బి.ప సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో భార్గవి ఆధ్వర్యంలో ఎంపీపీ గోళ్ళ అనూష జెండా ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్, ఆగిరిపల్లి ఆరోగ్య కేంద్రంలో జగన్మోహన్‌రావు, గ్రంథాలయం వద్ద సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీ, జడ్పీ హైస్కూల్‌లో పి. పుష్పలత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. బీజేపీ మండల కన్వీనర్ సంగా రంగారావు ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహించారు.

ప్రతిభకు ప్రశంసలు..

చాట్రాయి ఏవో శివశంకర్..



మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం

చాట్రాయి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): చాట్రాయి వ్యవసాయాధికారి బండారు శివశంకర్ ఏలూరులో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా ఉత్తమ వ్యవసాయాధికారిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఏవో శివశంకర్‌ను ప్రజాప్రతినిదులు, మండల స్థాయి అధికారులు రైతులు అభినందించారు.

ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ సత్యప్రసాద్..



ముసునూరు: ముసునూరు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్న కేవీ సత్యప్రసాద్‌కు ఉత్తమ సేవా పురస్కారం వరించింది. ఏలూరులో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఏఈ సత్యప్రసాద్‌ను ఎంపీడీవో బీఏ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

జూనియర్ అసిస్టెంట్ జానకిరామ్..




ముదినేపల్లి: ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నూతక్కి జానకిరామ్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పార్థసారథి కలెక్టర్ వెట్రిసెల్వి అవార్డు, ప్రశంసా పత్రాన్ని జానకిరామ్‌కు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు ఆయనను అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి నస్రీన్ బేగం..



కలిదిండి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తాడినాడ పంచాయతీ కార్యదర్శి నస్రీన్ బేగం శుక్రవారం ఏలూరులో మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకున్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో ఫణీంద్ర, తాడినాడ సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, మండల పంచాయతీ కార్యదర్శులు నస్రీన్ బేగంకు అభినందనలు తెలిపారు.

ఆగిరిపల్లి ఎస్‌ఐ శుభశేఖర్..



మంత్రి, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కె. శుభశేఖర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం ఏలూరులో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పోలీస్ శాఖలోని వివిధ విభాగాలలో పోలీస్ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ శుభశేఖర్‌కు మంత్రి పార్థసారథి, ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



భారీ జెండాతో ర్యాలీ

చాట్రాయి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): చనుబండలో బీజేపీ జిల్లా నాయకుడు బుర్రి శ్రీకర్ ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు ఓబిశ్శనేని రాజా, మోరంపూడి శ్రీనివాసరావు, చాగంటి వాసు, సిహెచ్ శ్రీనివాసరావు, కందుల కృష్ణ, మారేశ్వరరావు, సిహెచ్ పుల్లారావు దార్ల సురేష్, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని దేశభక్తి

ముదినేపల్లి: రంగాపురం మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు ముండూరు సాయిలక్ష్మి మువ్వన్నెల చీర ధరించి జాతీయ జెండాను ప్రదర్శిస్తూ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. 'నా జాతీయ జెండా నా కెంతో గర్వ కారణం' అంటూ నినాదాలిచ్చి అందరిలో స్ఫూర్తి నింపారు.





కాపా ఆర్థిక సాయం

నూజివీడు టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వంగేటి ప్రతాప్ ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను కాపా శ్రీనివాసరావు పరామర్శించి రూ. 50 వేల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందించారు. పిల్లలకు ఉచిత విద్య కోసం మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.



ఘనంగా పవిత్రోత్సవాలు

ముదినేపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. గోపూజ, సుప్రభాత సేవతోపాటు స్వామివార్లకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి స్వామివార్లకు పట్టు పవిత్రాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



శ్రీశ్యామలాంబ ఆలయం కిటకిట

కైకలూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని కైకలూరు పరిసర ప్రాంత గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి పుష్పాలంకరణ మచిలీపట్నంకు చెందిన శ్రీ శ్యామలా గోల్డ్ కవరింగ్ వర్క్స్ నిర్వహించగా, ప్రసాదాన్ని వరదా వెంకట శివకిషోర్, చాపరాల భానుభాస్కర్, అడ్డగర్ల సత్యనారాయణ, వి. సాంబమూర్తి, గుర్రం సత్యనారాయణ, తోట పెద్దిరాజు అందచేశారు. ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ విద్యార్థికి నగదు బహుమతి

ముదినేపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దుర్గా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ తన స్వగ్రామమైన పెదగొన్నూరులోని శ్రీ కాజ లక్ష్మీ నారాయణ మెమోరియల్ జడ్పీ హైస్కూల్‌లో ప్రతి ఏటా పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థికి ఇచ్చే నగదు అవార్డు ఈ ఏడాది రెడ్డి సందేశ్‌కు దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన వేడుకల్లో రూ.5 వేల నగదును ఆయన తరఫున గ్రామప్రముఖుడు గుడివాడ సీతారామయ్య ఆ విద్యార్థికి అందజేశారు.



దాత బెనర్జీ దంపతులు

ప్రహరీ నిర్మాణానికి సహకారం

ముసునూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వలసపల్లికి చెందిన కొల్లి రామ కృష్ణ బెనర్జీ ఆర్థిక సాయంతో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ, గేటు వసతులు సమకూరాయి. సుమారు రూ. 1.40 లక్షలతో కోడ్ నెంబర్ 143 అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మించి గేటును సైతం ఏర్పాటు చేసి, ఐసీడీయస్ అధికారులకు శుక్రవారం దాత అప్పగించారు. గతంలో ఈ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు దాత 4 సెంట్లు స్థలాన్ని కూడా ఇచ్చినట్లు సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. దాత బెనర్జీని ఐసీడీయస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.



ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కామినేని

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కైకలూరు, మండవల్లి భవిత కేంద్రాల దివ్యాంగ పిల్లలకు వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ బ్యాటరీ ట్రై సైకిల్స్ ఎమ్మెల్యే కామినేని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకునేలా వారి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఎంఈవో డి. రామారావు, ఎంపీపీ అడవి కృష్ణ, డీసీ చైర్మన్ వాసురాజు, అధికారులు పాల్గొన్నారు.

మాది సుపరిపాలన

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నాం. స్వర్ణాంధ్ర 2047 విజన్ అనేది ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి, పర్యావరణ సుస్థిరతలపై దృష్టి సారిస్తూ 2047 నాటికి భారతదేశానికి ఏపీ ప్రధాన వృద్ధి కేంద్రంగా మార్చడానికి కావాల్సిన ప్రణాళిక, కార్యాచరణ నిర్దేశిస్తుంది' అని పేర్కొన్నారు.

కుడి కాలువ పూర్తి చేస్తాం..

పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ పనులు 92.79 శాతం పూర్తి చేయడమే కాకుండా కృష్ణా డెల్టా ఆయకట్టును సంరక్షించేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 442 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్లించాం. తాడిపూడి ఎత్తిపోతల ప్రధాన పంప్ హౌస్‌ల పనులు పూర్తి చేయడమే కాకుండా లక్షా 57 వేల 544 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాం. జల వనరుల శాఖ ద్వారా ఓఅండ్‌ఎం పథకం కింద రూ.9 కోట్ల 11 లక్షల వ్యయంతో తూడు తొలగింపు పనులు పూర్తి చేశాం. జపాన్ బ్యాంక్ ఆర్థిక సాయంతో తమ్మిలేరు ప్రాజెక్టు మోడరైజేషన్‌కు రూ.16 కోట్ల 8 లక్షలతో పనులు పురోగతిలో ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం రావులచెరువును రూ.94 లక్షలతో అభివృద్ధి చేశాం. జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో 82,108 గృహాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో 19,581 గృహాలు, పీఎం జన్‌మన్ పథకంలో 556 గృహాలు మొత్తం మీద లక్షా 32 వేల 237 గృహాలను రూ.1,840.27 కోట్లతో మంజూరు చేశాం. ఇంతవరకు 44,533 గృహాల నిర్మాణం పూర్తి చేశాం. 2014-19 మధ్య మంజూరు కాబడిన పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులను దశల వారీగా చెల్లిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఈ విధానాన్ని ఈరోజే తీసుకొస్తున్నాం. వాట్సప్ నంబర్ 95523 00009 ద్వారా 700 సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలి' అంటూ మంత్రి విజ్ఞప్తి చేశారు.



ద్వితీయ బహుమతి సాధించిన వ్యవసాయ శాఖ శకటం



తృతీయ బహుమతి సాధించిన గృహ నిర్మాణ శాఖ శకటం

టీడీపీ విజయం చరిత్రాత్మకం

చాట్రాయి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అఖండ మెజారిటీతో గెలుపొందటం చరిత్రాత్మకమని నూజివీడు నియోజకవర్గ తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి మండలపు జగదీష్, టీడీపీ నాయకులు తల్లాడ శ్రీనివాసరావు, మాదాసు చిన్న పుల్లయ్య, వెల్ది నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ రెండు చోట్ల ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికలు నిర్వహించటంతో చరిత్రలో తొలిసారి అభ్యర్థు భయం లేకుండా పోటీ చేశారని, ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేయటం వల్లే టీడీపీ గెలుపు ఏకపక్షమైందన్నారు.

జిల్లా ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి : మేకా

నూజివీడు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప అప్పారావు విమర్శించారు. శుక్రవారం ఎంఆర్ అప్పారావు కాలనీలోని వైయస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా నూజివీడు ఏరియా ఆసుపత్రిని 220 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయితే ఆ దిశగా అడుగులు వేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైం దన్నారు. ఎంఆర్ అప్పారావు కాలనీలో రూ. 80 లక్షలతో వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తే సిబ్బందిని నియమించి ఆసుపత్రిని ప్రారంభించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు.

క్రైమ్ కార్నర్

గడ్డపలుగుతో దాడి.. ఒకరి మృతి

నూజివీడు టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు విషయంలో జరిగిన తగాదాలో దాడి చేయగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నూజివీడు మండలంలోని జంగంగూడెంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం జంగంగూడేనికి చెందిన తొమండ్రు ఏసేబు, మల్లెపూడి దేవసహాయం మధ్య స్థల వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఏసేబుపై దేవ సహాయం, అతని భార్య సువార్త గడ్డపలుగుతో దాడి చేయగా ఏసేబు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్‌ఐ జ్యోతిబసు, ఇతర పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని స్వాధీన పరుచుకుని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.